క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ ఐదు మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి

ఎల్.ఎన్.పేట: ప్రతి ఒక్కరూ ఏడాదికి ఐదు మొక్కలు నాటి, వాటిని పెంచే బాధ్యత తీసుకోవాలని ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి అన్నారు. మండలంలోని చింతలబడవంజ పంచాయతీ పరిధిలోని చెరువు, కాలువ గట్టు, రోడ్డు పక్కన శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్, ఉపాధి హామీ పథకం ఏపీఓ వి.శ్రీదేవి, చింతలబడవంజ సర్పంచ్ ఊట సత్యనారాయణ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రుచి, శుచి తప్పనిసరి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ దాలినాయుడు

నరసన్నపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరు ముద్ద ద్వారా అందజేస్తున్న మధ్యాహ్న భోజనం అమలులో రుచి, శుచి తప్పనిసరిగా పాటించాలని ఎంఈఓ దాలినాయుడు అన్నారు. మండలంలోని వంశధార కాలనీలో గల స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని శనివారం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అలాగే గొట్టిపల్లి స్కూల్‌ను ఎంఈఓ శాంతారావు పరిశీలించారు.

ఈ–క్రాప్ నమోదుపై అవగాహన



సూచనలిస్తున్న ఏడీఏ రజని

ఆమదాలవలస రూరల్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ఈ–క్రాప్ నమోదు పక్కాగా నిర్వహించాలని వ్యవసాయశాఖ ఏడీఏ బి.రజని అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఏఏ, వీఆర్వోలతో శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసే పంటల వివరాలను యాప్‌లో నమోదు చేయడంతో పాటు పంట కోత ప్రయోగాలు, ఈ–క్రాప్ కోసం సాగు విస్తీర్ణాన్ని అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ–క్రాప్ నమోదు ఆధారంగానే రైతులకు పంట నష్టపరిహారం, ఇన్సురెన్స్, పంట విక్రయాలు చేయడం జరుగుతుందన్నారు. ఈ–క్రాప్ నమోదు నమోదు సమయంలో ఎటువంటి తప్పులు లేకుండా ఉండాలన్నారు. ఏఓ మెట్ట మోహన్‌రావు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే చర్యలు



ఎరువులను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాసరావు

కొత్తూరు: ఎరువుల్లో నాణ్యత లోపించినట్లు పరీక్షల్లో నిర్ధారణ అయితే శాఖాపరమైన చర్యలు తప్పవని స్థానిక ఏఓ శ్రీనివాసరావు ఎరువుల డీలర్లకు హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎరువుల సెంటర్లను శనివారం పరిశీలించారు. ఎరువుల నమూనాలను సేకరించి..అమరావతిలోని కోడింగ్ సెంటర్‌కు పరీక్షల నిమిత్తం పంపించారు. ఎరువులు కొనుగోలు చేస్తున్న రైతులకు బిల్లు విధిగా ఇవ్వాలన్నారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణ బుట్టల పంపిణీ



చెత్త సేకరణ బుట్టలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ గోపి

జలుమూరు: జగనన్న స్వచ్ఛ సంకల్పం ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని ఎంపీపీ వాన గోపి అన్నారు. బసివాడలో చెత్త సేకరణకు అవసరమైన బుట్టలను శనివారం అందించారు. తడి, పొడి చెత్తగా వేరు చేసి వేయాలన్నారు. ఎంపీడీఓ అప్పారావు, ఈఓపీఆర్డీ ఉమామహేశ్వరరావు, సర్పంచ్ బుద్దల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోటరీ రీజనల్ సెక్రటరీగా వెంకుబాబు



జె.కె.వెంకుబాబు

ఆమదాలవలస: శ్రీకాకుళం రోటరీ క్లబ్ రీజనల్ సెక్రటరీగా ఆమదాలవలసకు చెందిన సామాజికవేత్త జె.కె.వెంకుబాబును నియమించారు. ఈ మేరకు రోటరీ ఉన్నత సభ్యుల నుంచి శనివారం ఉత్తర్వులు అందాయని వెంకుబాబు తెలిపారు. గతంలో రోటరీ గవర్నర్, అసిస్టెంట్ గవర్నర్‌తోపాటు పలు పదవులను చేశానన్నారు. తన సేవలను గుర్తించిన ఈ బాధ్యత అప్పగించినట్లు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన
- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



పొందూరు: కింతలిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కింతలిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ సంక్షేమాన్ని వివరిస్తూ, సమస్యలు తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. బడుగు, బలహీన వర్గాల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి తెలియజేయాలన్నారు. పథకాల కోసం ఎవరికి ఎటువంటి లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. గ్రామాల్లో ప్రతీ కుటుంబాన్ని కలిసే అవకాశం ప్రభుత్వం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గ్రామంలో కాలువలు, రోడ్లు కావాలని స్పీకర్‌ను ప్రజలు కోరారు. ఈ సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని స్పీకర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, పార్టీ నాయకులు కిల్లి నాగేశ్వరరావు, గాడు నాగరాజు, సింగూరు సూర్యనారాయణ, సింగూరు తేజేశ్వరరావు, బొమ్మాలి శేషగిరి, కిల్లి సన్యాసిరావు, పైడి లక్ష్మణరావు, పైడి రంగనాథం తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..

నరసన్నపేట: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేటలోని కలివరపుపేట, బొంతల వీధి, గొడగల వీధి, ఆదివరపుపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నాళ్లలో ఈ విధమైన సంక్షేమ పథకాలు గతంలో మరే ప్రభుత్వం అందించలేదన్నారు. చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ దారుణమైన ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన చెందారు. అధికారం కోసం దేనికైనా సిద్ధపడే మనస్తత్వం కలిగిన చంద్రబాబు ప్రసంగాలను పట్టించుకోవద్దన్నారు. నిత్యం ప్రజలకు మేలు చేయాలనే తలంపుతో ఉన్న సీఎం జగన్ మోహనరెడ్డికి అందరూ అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ సభ్యురాలు చింతు అన్నపూర్ణ, సుడా చైర్మన్ కోరాడ ఆశాలత, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, సొసైటీ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, పార్టీ నాయకులు చింతు రామారావు, కేసీహెచ్‌బీ గుప్త, చీపురు కృష్ణ, నేతింటి సింహాచలం, పాగోటి రాజారావు, కేశవరాజు, బొబ్బాది ఈశ్వరరావు, బీఎల్ శర్మ, డేవిడ్, ఎంపీడీఓ బి.మధుసూదనరావు, పంచాయతీ ఈఓ సింహాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.



నరసన్నపేట: కలివరపుపేటలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పామాయిల్ సాగుతో ఆదాయం



పామాయిల్ మొక్క నాటుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: రైతు మెరుగ్గా బతకాలని, ఉజ్వల భవిష్యత్ అందుకోవాలనే మంచి ఆలోచనతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అందజేస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డిశాంతి అన్నారు. మండలంలోని కేరాసింగి పంచాయితీ పరిధి చిన్న సున్నాపురంలో పామాయిల్ మొక్కలను శనివారం నాటారు. ఈ పంట ఒక్క సారివేస్తే నిత్యం ఆదాయం వస్తుందన్నారు. దీనికి డ్రిప్ ద్వారా నీటిని అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం 90 శాతం రాయితీతో యంత్రాలను సైతం అందిస్తుందని, వీటి కోసం ఆర్‌బీకేలను సంప్రదించాలన్నారు. ప్రస్తుతానికి మండలంలో 25 ఎకరాలు సాగుచేయడానికి రైతులను గుర్తించామని, ఆసక్తి కలిగిన మరింతమంది రైతులను గుర్తిస్తామని మండల వ్యవసాయశాఖ అధికారి ధానకర్ణుడు అన్నారు. స్థానిక సర్పంచ్ ఆదిలక్ష్మి, ఎంపీడీఓ చంద్రకుమారి, జెడ్పీటీసీ గూడ ఎండయ్య, మండల నాయకులు బైపోతు ఉదయ్‌కుమార్, లింగాల సంజీవరావు, వీఏఏలు షన్ముఖరావు, శరత్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోండి



రాయితీపై వచ్చిన ఇన్‌పుట్స్‌ను రైతులకు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: ప్రభుత్వం వ్యవసాయం మొదటి ప్రాధాన్యతగా తీసుకుని రైతులకు అందజేస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మబగాం గ్రామంలో ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 90 శాతం రాయితీపై వచ్చిన స్ప్రింక్లర్ పైపుల పంపిణీ కార్యక్రమంలో శనివారం పాల్గొన్నారు.

ఈ ఏడాదికి గాను నియోజకవర్గంలో 22 మంది రైతులకు పంపిణీ చేసినట్లు పీడీ తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ఇప్పుడు జరుగుతున్న ఈ క్రాప్ బుకింగ్‌పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ సెంటును ఆన్‌లైన్ చేయాలని వీఏఏ లకు సూచించారు. నరసన్నపేట ఏఓ సునీత మాట్లాడుతూ ఇప్పటికే రైతులకు ఈ క్రాప్ బుకింగ్‌పై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించామన్నా. పోలాకి ఏఓ చిరంజీవి, ఏపీఎంఐపీ, మబగాం సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకే టీడీపీ దాడులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన అభివృద్ధిని చూసి ఓర్వలేకే టీడీపీ శ్రేణులను చంద్రబాబు రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, జెడ్పీటీసీ కామక భాగవతి, పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. కొత్తూరులో శనివారం విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో ప్రజలను భయపెట్టించేందుకే పోలీసులపై చంద్రాబాబు దాడులు చేయించారని విమర్శించారు. పెన్నా టూ వంశధార ప్రాజెక్టుల సందర్శన పేరుతో చంద్రబాబు జిల్లా పర్యటనకు రానుండటం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వంశధార నిర్వాసితుల ప్యాకేజీలను టీడీపీ మాజీ ఎమ్మెల్యే కలమట వెకంటరమణ, మాజీ మంత్రి అచ్చెన్నాయుడులు దొచుకొని.. నేడు న్యాయం చేయాలని మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. నిస్వార్థంగా సేవలు అందిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతిని విమర్శించే హక్కు కలమటకు లేదన్నారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం తగదన్నారు. సర్పంచ్ కుంచాల రత్నాలు, లోతుగెడ్డ తిరుపతిరావు, కామక త్రినాథరావు, వైకుంఠరావు, సాదుబాబు, ధర్మారావు, శంకరరావు, ఎస్.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి యోగా తరగతులు

నరసన్నపేట: స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకు ఆర్టీఆ ఫ్ లివింగ్ ఆధ్వర్యంలో యోగా తరగతులు నిర్వహించనున్నామని యోగా గురువు సదాశివుని రవి శనివారం తెలిపారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారి హ్యాపీనెస్ ప్రోగ్రాంలో భాగంగా ఈ యోగా తరగతులు చేపడుతున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు పేర్లు ముందుగా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. సుదర్శన క్రియపై ప్రత్యేక క్లాసులు నిర్వహించనున్నామన్నారు. చివరి రోజున రవిశంకర్ ప్రవచనాలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉంటాయన్నారు.

పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పన

- 52 సచివాలయాల పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి..
- శాసన సభాపతి తమ్మినేని సీతారాం



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: నియోజకవర్గంలో ప్రతీ గ్రామానికి కనీస మౌలిక వసతుల కల్పనకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నానని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సచివాలయం పరిధిలో కనీస వసతుల కల్పనకు కట్టుబడి ఉందన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 52 సచివాలయాల పరిధిలో గల గ్రామాల్లో, వార్డుల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణలపై హౌసింగ్ అధికారులతో చర్చించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎలక్ట్రికల్ ఈఈ బయ్యన్నాయుడు, మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, ఎంపీడీఓలు హరిహరరావు, రవీంద్రబాబు, మురళీమోహన్‌రావు, వాసుదేవరావు, పార్టీ నాయకుడు కె.వి.జి.సత్యనారాయణ, జెడ్పీటీసీలు రామారావు, సురవరపు నాగేశ్వరరావు, పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, బొడ్డేపల్లి నారాయణరావు, పార్టీ మండల కమిటీ అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, ఖండాపు గోవిందరావు, పొడుగు శ్రీనివాసరావు, పి.రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల సర్వే చేపట్టాలి

ఎల్.ఎన్.పేట: ఓటర్ల జాబితాల్లో తప్పులు, బోగస్ ఓట్లు, మరణించి వ్యక్తుల ఓట్లు ఉంటే బాధ్యులైన బీఎల్‌ఓలపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఆర్.అప్పలరాజు హెచ్చరించారు. మండలంలోని తురకపేట పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ఓటర్ల విచారణ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఆయా గ్రామాలకు చెందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్‌ఓలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల విచారణ చేయాలన్నారు. ప్రతీ ఓటుకు ఆధార్ కార్డు నంబర్ అనుసంధానం తప్పనిసరిగా చేయాలన్నారు. తహసీల్దార్ రశీద్ ఆహ్మద్, బీఎల్‌ఓ జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ: ఓటర్ సర్వే క్షేత్ర స్థాయిలో చేపట్టాలని స్థానిక తహసీల్దార్ ఎస్.రమణారావు అన్నారు. మండల కేంద్రంలో గల తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో బీఎల్‌ఓలతో శనివారం సమావేశం నిర్వహించారు. సర్వేపై సమగ్రంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ప్రధానంగా వలస ఓటర్లపై దృష్టి సారించాలన్నారు. ఆమదాలవలస తహసీల్దార్ ఎస్.గణపతిరావు, ఎన్నికల డీటీ మురళీధర్ నాయక్, బూర్జ డీటీ సంతోష్‌కుమార్ ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఎల్.ఎన్.పేట: జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ ఏఈ కె.రమేష్ లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని కరకవలస పునరావాస కాలనీ వద్ద జరుగుతున్న జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించారు. కరకవలస, తురకపేట, మిరియాపల్లి, పెద్దకొల్లివలస గ్రామాల్లో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. నిర్మాణ స్థాయిల మేరకు లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తున్నట్లు వివరించారు. కొంతమంది లబ్ధిదారులకు నిధులు విడుదల కావల్సి ఉందన్నారు. అక్టోబర్ నాటికి కాలనీ ఇళ్ల నిర్మాణం పనులు పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం కావాలన్నారు.

పశు వ్యాధులపై అప్రమత్తం

ఆమదాలవలస: పశు వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆమదాలవలస పశుసంవర్థక శాఖ ఏడీ ఆర్.ఆనందరావు సూచించారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి పాత ఆమదాలవలస, గేటు ప్రాంతాల్లో పాడి పశువులకు లంపీ స్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న శిబిరాన్ని శనివారం పరిశీలించారు. పశువైద్య సిబ్బంది, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు మార్చాలని వినతి

నరసన్నపేట: వాహనాల ద్వారా బియ్యం, పంచదార పంపిణీ చేస్తున్న సమయంలో ప్రస్తుతం రెండుసార్లు వేలిముద్రలు వేయాలని అధికారులు సూచించడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని, బియ్యం పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతుందని ఎండీయూ ఆపరేటర్లు ఆవేదన చెందారు. ఒక సారే వేలిముద్ర వేసేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు మార్చాలని కోరుతున్నారు. ఈ మేరకు స్థానిక సివిల్ సప్లయ్ డీటీ రామకృష్ణకు శనివారం వినతి పత్రం ఇచ్చారు. జులై నుంచి పంచదార, బియ్యానికి వేర్వేరుగా రెండుసార్లు వేలిముద్రలు తీసుకుంటున్నామని, దీంతో ఆలస్యం అవుతుందన్నారు. కొన్నిచోట్ల సర్వర్ డౌన్ అయి మరింత జాప్యం అవుతుందని వినియోగదారులు విసిగిపోతున్నారన్నారు. వినతిపత్రం అందించిన వారిలో నరసన్నపేట ఎండీయూ ఆపరేటర్ల సంఘం ప్రతినిధి నాగరాజు, తదితరులున్నారు.

ఉద్యోగికి సేవలే గుర్తింపునిస్తాయి

పాతపట్నం: సేవలే ఉద్యోగికి గుర్తింపును తీసుకువస్తాయని ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళ్లిన ఎంఈఓ మణికుమార్ దంపతులను శనివారం ఘనంగా సన్మానించారు. ఇక్కడకు వచ్చిన ఇద్దరు ఎంఈఓలు శ్రీధర్, తిరుమలరావును ఆహ్వానించారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు పి.రామరాజు, అమర్ జనార్దనరావు, పి.మురళీకృష్ణ, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ఎల్.ఎన్.పేట: మల్లమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శివకుమార్



కొత్తూరు: రాజులమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నాగరాజు

ఎల్.ఎన్.పేట: మండలంలోని గొట్టిపల్లి గ్రామానికి చెందిన కుంచాల మల్లమ్మకు కాలు విరిగిపోవటంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. గ్రామ వలంటీర్ వెలమల శివకుమార్ శనివారం ఆస్పత్రికి వెళ్లి మల్లమ్మకు వితంతు పింఛన్ అందజేశాడు. ఆస్పత్రి ఖర్చులకు ఉపయోగపడతాయని మల్లమ్మ సంతోషం వ్యక్తం చేశారు.

85 కిలో మీటర్లు ప్రయాణించి..

కొత్తూరు: మండలంలోని దిమిలి గ్రామానికి చెందిన శివకల రాజులమ్మ అనారోగ్యంతో రాగోలులోని జెమ్స్‌లో వైద్యం పొందుతున్నారు. గ్రామ వలంటీర్ డి.నాగరాజు 85 కిలో మీటర్లు దూరంలో ఉన్న జెమ్స్ ఆస్పత్రికి శనివారం వెళ్లి రాజులమ్మకు వితంతు పింఛన్‌ను అందజేశాడు.

ప్రభుత్వ భవనాలు వెంటనే పూర్తిచేయాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ ఉషారాణి

పాతపట్నం: గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్‌లు ఎప్పటికి పూర్తవుతాయని ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, మండల ఇంజినీర్ టి.ప్రసాద్‌ను సభ్యులు నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. మండలంలోని 18 గ్రామ సచివాలయాల్లో ఒకటి మాత్రమే ప్రారంభించారని, ఇంకా మిగిలిన సచివాలయ భవనాలు, 18 ఆర్‌బీకేలు ఎప్పటికి పూర్తి చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. ఉప తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని 49 రెవెన్యూ గ్రామాల పరిధిలో 20 గ్రామాల్లో భూసర్వే పూర్తయిందన్నారు. మిగిలిన గ్రామాల్లోనూ త్వరలోనే పూర్తిచేస్తామన్నారు. ఎంఈఓ శ్రీధర్ మాట్లాడుతూ చాకిపల్లి గ్రామానికి ప్రభుత్వం నూతన పాఠశాల భవనం మంజూరు చేసిందన్నారు. డెప్యుటేషన్‌పై ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించామన్నారు. గతంలో ఇక్కడ ఎయిడెడ్ పాఠశాల ఉండేదన్నారు. వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్ మాట్లాడుతూ పాతపట్నం మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్య పనులు చేపట్టి, బ్లీచింగ్ చల్లించాలన్నారు. పారిశుద్ధ్య పనులు చేపడతామని ఈఓ కుర్మారావు సమాధానం ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కల్యాణ్ రామ్ మాట్లాడుతూ పాతపట్నంలో మండలంలో 48 గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిలు మంజూరయయ్యాని, ప్రస్తుతం 5 గ్రామాల్లో పనులు పూర్తిచేసి తాగునీరు అందించామన్నారు. సెప్టెంబర్ ఆఖరులోగా మరో 22 గ్రామాల్లో పనులు పూర్తిచేస్తామన్నారు. మండల ఇంజినీర్ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాలకు సంబంధించిన బిల్లులు చెల్లించామని అయినా సంబంధిత కాంట్రాక్టర్‌లు పనులు చేయడం లేదన్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేసి నోటీసులు అందిస్తామన్నారు. మండల ప్రత్యేకాధికారి మంచు కరుణాకరరావు, జెడ్పీటీసీ లింగాల ఉషారాణి, మండల సలహాదారుడు ఎం.గణపతి, వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్, ఏఎంసీ చైర్మన్ కొండాల అర్జునుడు, ఏపీఎం మణిరత్నం, ఏపీఓ సురేష్, ఆర్ అండ్‌బీ జేఈ గోపాలరావు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం



కొత్తూరు: సంపూర్ణ పోషణ కిట్లును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

తల్లిపాలు వారోత్సవాలు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ కార్యక్రమాలను ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం నిర్వహించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా ప్రభుత్వం నుంచి సరఫరా చేసిన పౌష్టికాహార కిట్లును లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. పలుచోట్ల సామూహిక సీమంతాలు నిర్వహించారు. చిన్నారులు, బాలింతల్లో రక్తహీనతను, పోషకాహార లోపాన్ని నివారించడమే ఈ పథకం ముఖ్య లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమాల్లో ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస రూరల్: నెల్లిపర్తిలో కిట్లు పంపిణీ చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలారాణి



సారవకోట: చిన్నగుజ్జువాడలో కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ బాబూరావు



జలుమూరు: తిమడాంలో తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



మెళియాపుట్టి: మండల కేంద్రంలో సీమంతాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సరుబుజ్జిలి: రావివలసలో కిట్లు అందజేస్తున్న సర్పంచ్ వండాన కృష్ణ



నరసన్నపేట: మఠంవీధిలో కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు